RNI: TELTEL12215
https://youtube.com/@UstudioTV
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com





RANGAREDDY, EDITION : 01, VOLUME :160 EDITOR:CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 25 OCTOBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 160 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 25 అక్టోబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

### గాజాపై కొనసాగుతున్న
## ఇజ్రాయిల్ దాష్టీకాలు

- 24 గంటల్లో 700 మంది పైగా పౌరుల మృతి
- 400కి పైగా లక్ష్యాలపై వైమానిక దాడులు



**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు**

అమెరికా, బ్రిటన్ అండదండలతో ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో ఊగిపోతోంది. విరామం లేకుండా వైమానిక దాడులతో గాజాపై విరుచుకుపడుతోంది. ఆసుపత్రులపైనా బాంబుల వర్షం కురిపిస్తోంది. వందలాది మంది ప్రాణాలను తోడేస్తోంది. మంగళవారానికి గడిచిన 24 గంటల్లోనే ఇజ్రాయిల్ సాగించిన వైమానిక దాడుల్లో గాజా ప్రాంతంలో 704 మంది చని పోయారు. ఈనెల 7న దాడులు ప్రారంభమైన

మిగతా 2లో

### అరాచక ప్రభుత్వాన్ని
# ఇంటికి సాగనంపుదాం..!



- ఉమ్మడి కార్యాచరణ రూపొందించి ప్రజల తరపున పోరాడతాం
- వైసీపీ తెగులు వదిలించేందుకు టిడిపి-జనసేన వ్యాక్సిన్
- నవంబరు ఒకటో తేదీన ఉమ్మడి మేనిఫెస్టో విడుదల
- పవన్ కళ్యాణ్, నారా లోకేష్

**రాజమహేంద్రవరం - ప్రభాత సూర్యుడు:** ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు, ప్రజల భద్రత కోసం టిడిపి-జనసేన కలిశాయని, వైసీపీ చెడు పోవాలంటే టిడిపి-జనసేన రావాల్సిందేనని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలో టిడిపి-జనసేన సమన్వయ కమిటీ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాలనూ బెదిరిస్తున్నారని, అన్ని పార్టీల నేతలనూ ఇబ్బంది పెడుతున్నారని, ఈ అరాచక ప్రభుత్వాన్ని ఇంటికి పంపాల్సిందేనన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వబోనని గతంలోనే చెప్పానని, రాష్ట్ర అభివద్ధే తమకు ముఖ్యం అని స్పష్టం చేశారు. అనుభవం ఉన్న

మిగతా 2లో

## సీఎం కేసీఆర్ పర్యటనల్లో మార్పులు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**




బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్.. నియోజకవర్గాల పర్యటనల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 26న నాగర్‌కర్నూల్‌కు బదులుగా వనపర్తిలో సభ నిర్వహిస్తారు. ఈనెల 27న గతంలో ప్రకటించిన స్టేషన్‌ఘన్‌పూర్‌కు బదులుగా మహబూబాబాద్, వర్ధన్నపేట ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొంటారు. మిగతావన్నీ యథాతథంగా కొనసాగుతాయి. ఈనెల 15న మేనిఫెస్టో ప్రకటించి.. హుస్నాబాద్ నుంచి కేసీఆర్ ఎన్నికల ప్రచార సభలకు శ్రీకారం చుట్టారు. రోజుకు రెండు నియోజకవర్గాల చొప్పున .. ఇప్పటి వరకు హుస్నాబాద్, జనగామ, భువనగిరి, సిద్దిపేట,

మిగతా 2లో

## వచ్చే రామనవమి అయోధ్యలోనే...!


### - రామ్‌లీలా దసరా ప్రసంగంలో మోదీ



**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు నవరాత్రి, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక ఈ పండుగ అని అభివర్ణించారు. అయోధ్యలో భవ్య రామాలయాన్ని చూసే భాగ్యం మనకు కలగనుందని, వచ్చే రామనవమి అయోధ్యలోనే జరుగుతుందని అన్నారు. ఢిల్లీలోని ద్వారక సెక్టర్-10లో రామ్‌లీలా మైదాన్‌లో మంగళవారంనాడు జరిగిన దసరా వేడుకల్లో ముఖ్య అతిథిగా మోదీ పాల్గొన్ని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, చంద్రయాన్ మిషన్ విజయవంతమైన రెండు నెలలైన ఈ ఏడాదిలోనే విజయదశమి వేడుకలు జరుపుకొంటున్నామని, విజయదశమికి సంప్రదాయబద్ధంగా 'శస్త్ర పూజ' కూడా చేస్తుంటామని చెప్పారు. భారతదేశ గడ్డపై

మిగతా 2లో

### తీవ్ర తుఫానుగా మారిన
## అల్పపీడనం 'హమూన్'



**భువనేశ్వర్ - విజయనేత్ర**


బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర తుఫానుగా మారింది. ఈ తుఫానుకి 'హమూన్'గా పేరు పెట్టినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) మంగళవారం ప్రకటించింది. ఒడిసాకు 200 కి.మీ దూరంలో తీరం దాటే అవకాశం ఉన్నందున ఒడిసాపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గంటకు 21 కి.మీ వేగంతో దూసుకువస్తున్న ఈ తుఫాను మరికొన్ని గంటల్లో తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని అన్నారు. ఒడిసాలోని పారాదీప్‌కు 230 కి.మీ, పశ్చిమ బెంగాల్‌లోని ధిగాకు 240 కి.మీ దూరంలో, బంగ్లాదేశ్‌లోని చిట్టిగాంగ్‌కు 410 కి.మీ దూరంలో కేంద్రీకృతమైందని తెలిపారు.

ఈశాన్య దిశగా కదులుతున్న తుఫాను

మిగతా 2లో

## దేశంలో అపారమైన అవకాశాలు

- ప్రస్తుత విద్యావిధానంలో ఎస్‌టిఇఎమ్‌కి ప్రాధాన్యత
- విజ్ఞాన్స్ స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



**గుంటూరు - విజయనేత్ర :** ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కవ అవకాశాలు కలిగిన దేశం భారత దేశమని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గుంటూరు జిల్లా, వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ స్నాత కోత్సవంలో సోమవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గని ప్రసంగించారు. విదేశాల నుంచి 13 మేజర్ స్టార్టప్ కంపెనీలు మనదేశంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నాయని తెలిపారు. ఈ కంపెనీలు తమ ఉత్పత్తులను మన దేశంలో తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తాయన్నారు. సాఫ్ట్‌వేర్, ఐటి కంపెనీలలో విద్యార్థులు ఉద్యోగాలను వెతు కోక్కుండా మెటీరియల్స్, రేర్ మినరల్స్, మెటీరియల్ సైన్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి రంగాలలో పరిశోధనలకు పూనుకోవాలని సూచించారు. దీనికి అనుగుణంగా ప్రస్తుత విద్యావిధానంలో ఎస్‌టిఇఎమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమాటిక్స్)కి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సహజసిద్ధమైన గ్యాస్ టెక్నాలజీ మీద కూడా పరిశోధనలు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, శాసన వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థు లందరికీ అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని ఒడిసి పట్టుకోవాలని సూచించారు. స్నాతకోత్సవం సంద ర్భంగా వివిధ రంగాలలో కృషి చేసిన

మిగతా 2లో

### భారత్‌తో పాటు మరో ఆరు దేశాలకు
## ఉచిత వీసాలు




**కొలంబో- విజయనేత్ర**

ఇకపై భారతీయులు ఉచిత పర్యాటక వీసాలతో శ్రీలంకలో పర్యటించవచ్చు. పర్యాటక రంగానికి ప్రోత్సాహం అందించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు శ్రీలంక ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. భారత్‌తో పాటు మరో ఆరు దేశాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు శ్రీలంక విదేశాంగ మంత్రి అలీ సబ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. తక్షణమే అమల్లోకి రానున్న ఈ పైలెట్ ప్రాజెక్ట్ వచ్చే ఏడాది మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. భారత్‌తో పాటు రష్యా, చైనా, మలేషియా, జపాన్, ఇండోనేషియా, థాయిలాండ్ దేశాల పర్యాటకులు ఎలాంటి రుసుము లేకుండా

మిగతా 2లో

# గాజాపై కొనసాగుతన్న ఇజ్రాయిల్ దాష్టీకాలు

(మొదటిపేజీ తరువాయి)
తర్వాత 24 గంటల వ్యవధిలో మృతి చెందిన వారి సంఖ్య ఇదే అధికం. దీంతో ఇజ్రాయిల్ దాడిలో గాజా, పరిసర ప్రాంతాల్లో ఇప్పటి వరకు మృతి చెందిన పాలస్తీనియన్ల సంఖ్య 5100కు చేరిందని పాలస్తీనా ఆరోగ్యమంత్రిత్వ శాఖ వెల్లడించింది. వీరిలో సుమారు 2000 మంది చిన్నారులున్నట్లు పేర్కొంది. వేలాది భవనాలు నేలమట్టం అయ్యాయని, దాదాపు పది లక్షల మంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలిపోయారని తెలిపింది. ఆసుపత్రుల్లో జనరేటర్ల కోసం ఇంధన నిండుకుందని, చిన్నారులు, రోగులు అవస్థలు పడుతున్నారని గాజా ఆసుపత్రుల అధికారులు దయనీయస్థితిలో వేడుకుంటున్నా ఇజ్రాయిల్ కనికరించడం లేదు. ఇంధన ట్యాంకులు ఆసుపత్రులకు చేరకుండా సరిహద్దు ప్రాంతాల్లోనే నిలిపివేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లుహెచ్ఎ) సైతం గాజాకు మానవతా సాయం అత్యవసరంగా అందాల్సివుందని అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది. ప్రత్యేకించి ఇంధనం చాలా కీలకంగా మారిందని, ఈ దశలో పూర్తి స్థాయిలో సురక్షితమైన మానవతా సాయం అందాల్సి వుందని డబ్ల్యుహెచ్ఎ ప్రాంతీయ అత్యవసర పరిస్థితుల డైరెక్టర్ డాక్టర్ర ఇక్ బ్రెన్నన్ కోరారు. తమ సహాయ కార్యకర్తలకు ఎలాంటి రక్షణ కల్పించడం లేదని ఐక్యరాజ్య సమితి సంస్థలు తెలిపాయి. గాజాలోకి మరింత సాయం వెళ్ళేలా చూడాలని ఐక్యరాజ్య సమితి ఇజ్రాయిల్‌ను మరోమారు కోరింది. వేలాదిమంది ప్రజలు విపత్కర పరిస్థితుల్లో వున్నారని ఆందోళన వ్యక్తం చేసింది.

**యుద్ధానికి కాలుదువ్వుతున్న పదాతి దళాలు**

ఇజ్రాయిల్, గాజాకు సరిహద్దుల్లో పెద్ద సంఖ్యలో ఇజ్రాయిల్ ట్యాంక్‌లు, బలగాలు మోహరించి వున్నాయి. పదాతి దళ దాడికి ఆదేశాలు కోసం వారంతా ఎదురుచూస్తున్నారు. గతరాత్రి గాజాలో 400కి పైగా మిలిటెంట్ లక్ష్యాలపై దాడిచేశామని ఇజ్రాయిల్ మిలటరీ తెలిపింది. ముగ్గురు డిప్యూటీ కమాండర్లతో సహా పెద్ద సంఖ్యలో హమస్ మిలిటెంట్లను హతమార్చామని వెల్లడించింది. మరోవైపు ఇజ్రాయిల్‌కు తమ పూర్తి మద్దతు వుంటుందని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ప్రకటించారు. మంగళవారం టెల్ అవీవ్ చేరుకున్న ఆయన నెతన్యాహుతో భేటీ అయ్యారు. అయితే హమస్‌తో యుద్ధం చేసే సమయంలో నిబంధనలు అతిక్రమించరాదని ఆయన స్పష్టం చేశారు.

# భారత్‌తో పాటు మరో ఆరు దేశాలకు ఉచిత వీసాలు

(మొదటిపేజీ తరువాయి)
వీసాలను పొందవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు. శ్రీలంక ప్రధాన ఆదాయ వనరైన పర్యాటక రంగంపై . కొవిడ్ మహమ్మారితో పాటు ఆదేశంలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక సంక్షోభాలతో తీవ్ర ప్రభావం పడింది. దీంతో పర్యాటక రంగానికి తోడ్పాటు నందించేందుకు శ్రీలంక ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అధికారిక లెక్కల ప్రకారం.. గతేడాది సెప్టెంబర్‌లో 30,000 మందికి పైగా భారత పర్యాటకులు శ్రీలంకను సందర్శించారు. చైనాపై 26 శాతం అధికంతో భారత్ ప్రధమ స్థానంలో నిలవగా, 8,000 మంది పర్యాటకులతో చైనా రెండో స్థానంలో నిలిచింది.

# తీవ్ర తుఫానుగా మారిన అల్పపీడనం 'హమూన్'

(మొదటిపేజీ తరువాయి)
క్రమంగా బలహీనపడి మంగళవారం సాయంత్రానికి తీవ్రంగా మారే అవకాశం ఉందని, గంటకు 65 -75 కి.మీ వేగంతో బలమైన గాలులు వీస్తాయని ఐఎండి అంచనా వేసింది. బుధవారం బంగ్లాదేశ్‌లోని హెపుపరా , చిట్టిగాంగ్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తుఫాను ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు ఒడిసాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు.

# దేశంలో అపారమైన అవకాశాలు

(మొదటిపేజీ తరువాయి)
హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ ఫౌండర్ డాక్టర్ సుబ్బారావ్ పావులూరి, హైదరాబాద్‌లోని విమ్టా ల్యాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఎస్‌పి వాసిరెడ్డి, ఇండియన్ చెస్ ప్లేయర్, పద్మశ్రీ, అర్జున అవార్డు గ్రహీత కోనేరు హంపికి విజ్ఞాన్స్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్‌చైర్మన్, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ పర్యటనల్లో మార్పులు

(మొదటిపేజీ తరువాయి)
సిరిసిల్ల, జడ్చర్ల, మేడ్చల్‌లో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారు. బతుకమ్మ, దసరా పండుగలు ఉన్నందున సభలకు విరామం ఇచ్చిన కేసీఆర్ గురువారం నుంచి మళ్లీ సుడిగాలి పర్యటనలకు సిద్ధమవుతున్నారు. ఈనెల 26న అచ్చంపేట, వనపర్తి, మునుగోడులో.. 27న పాలేరు, మహబూబాబాద్, వర్ధన్నపేటలో కేసీఆర్ సభలు ఉంటాయి. నవంబరు 8 వరకు కోదాడ, తుంగతుర్తి, ఆలేరు, జుక్కల్, బాన్సువాడ, నారాయణఖేడ్, హుజూర్ నగర్, మిర్యాలగూడ, దేవరకొండ, సత్తుపల్లి, ఇల్లెందు, నిర్మల్, బాల్కొండ, ధర్మపురి, భైంసా, ఆర్మూరు, కోరుట్ల, కొత్తగూడెం, ఖమ్మం, గద్వాల్, మక్తల్, నారాయణపేట, చెన్నూరు, మంథని, పెద్దపల్లి, సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లిలో కేసీఆర్ పర్యటించనున్నారు. నవంబరు 9న గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాల్లో నిర్వహించే సభల్లో కేసీఆర్ పాల్గొంటారు.

# అరాచక ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదాం..!

(మొదటిపేజీ తరువాయి)
ఉండాలనే 2014లో టీడీపీకి మద్దతిచ్చామన్నారు. వైసీపీకి తాము వ్యతిరేకం కాదని, వైసీపీ అవలంబిస్తున్న అరాచక విధానాలకు మాత్రమే వ్యతిరేకమన్నారు. మద్యనిషేధం చేస్తామని చెప్పి విచ్చలవిడిగా ప్రమాదకర మద్యం అమ్ముతున్నారని మండిపడ్డారు. ఈ రాష్ట్రానికి తెగులులా పట్టిపీడిస్తోన్న వైసీపీ పోవాలంటే టీడీపీ-జనసేన వ్యాక్సిన్ అవసరం అని చెప్పారు. చంద్రబాబును అక్రమంగా జైలులో పెట్టారని, సాంకేతిక అంశాల పేరుతో బెయిల్ రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు మద్దతు ఇచ్చేందుకే రాజమహేంద్రవరంలో భేటీ అయ్యామని, రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చేందుకే మళ్లీ ఇక్కడే కలిశామన్నారు. టిడిపి-జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టో, కలిసి పనిచేయడం, వచ్చే ఎన్నికల్లో ఎలా ముందుకెళ్లాలనే దానిపై లోతుగా చర్చించామన్నారు. త్వరలో కనీస ఉమ్మడి ప్రణాళిక ప్రకటిస్తామన్నారు. రాష్ట్ర ప్రజలకు సుస్థిరమైన ప్రభుత్వం ఇవ్వాలనే అంశమే తమ ప్రధాన చర్చనీయాంశంగా సాగిందన్నారు. రాష్ట్ర ప్రజలకు భద్రత, సంక్షేమం, అభివద్ధి కావాలన్నారు. రెండు పార్టీల మధ్య ఉండే క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించుకుంటామని, ఉమ్మడి కార్యాచరణపై మరో వారం, పది రోజుల్లో స్పష్టత ఇస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెల్లడించారు.

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మాట్లాడుతూ.. విజయదశమి రోజున టిడిపి-జనసేన కలయిక రాష్ట్రానికి మేలు చేయనుందని, వచ్చేది టిడిపి-జనసేన ప్రభుత్వమేనని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. 2014లో రాజధాని కూడా లేని నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నడిపించేందుకు సమర్థుడైన నాయకుడు కావాలని పవన్ కళ్యాణ్ గారు అన్ కండిషనల్‌గా టిడిపికి మద్దతు ఇవ్వగా ప్రభుత్వం ఏర్పడి, అనేక సంక్షేమ -అభివద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే టిడిపి-జనసేన మరోసారి కలిసి సాగాలని నిర్ణయించుకున్నాయని ప్రకటించారు. నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో సామాజిక అన్యాయం జరిగిందన్నారు. వైసీపీ పాలకులు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీలకి తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. వైసీపీ పాలనలో బీసీ వర్గాలను వేధిస్తున్నారని, బీసీలకు రావాల్సిన అనేక సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేశారన్నారు. దళిత డాక్టర్ సుధాకర్ నుంచి డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకూ ఎందరో ఎస్సీలని వైకాపా సర్కారు వెంటాడి వేధించి చంపేసిందన్నారు. ఎస్సీలకు రావాల్సిన 26 సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేశారని ఆరోపించారు. ఇస్లాంలో ఆత్మహత్య పాపం అని, వైసీపీ నేతల వేధింపులు తాళలేక ముస్లిం సోదరులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర కరువుతో 34 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినా రైతుల్ని ఆదుకునే చర్యలు సర్కారు తీసుకోలేదన్నారు. సాగునీటి ప్రాజెక్టుల్లో ప్రభుత్వ చేతకానితనం కనిపిస్తోందన్నారు. ప్రాజెక్టులు మూలనపడ్డాయని, మిగులుజలాలు సముద్రంలోకలిశాయని, రైతు ఆత్మహత్యల్లో ఏపీ 3వ స్థానంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డీజిల్ పెట్రోల్ ధరలు, కరెంటు చార్జీలు, పన్నులు విపరీతంగా పెంచేసి ప్రజలపై మోయలేని భారం వేశారని లోకేష్ మండిపడ్డారు. అధికారంలోకి వస్తే 2.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చిన జగన్, సీఎం అయ్యాక ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారని ఆరోపించారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, ఉద్యోగాలు లేక యువత పక్క రాష్ట్రాలకు వెళ్లిపో తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వేధిస్తున్నారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం, అరాచక సర్కారుపై ప్రజల తరపున పోరాడేందుకు టిడిపి-జనసేన కలిశాయని, నవంబరు 1న ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఓటరు జాబితాపై అక్రమాలపై క్షేత్రస్థాయిలో ఉమ్మడిగా పరిశీలన ఉంటుందన్నారు. నవంబరు 1 నుంచి ఉమ్మడి మ్యానిఫెస్టో ప్రకటించి, ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తామన్నారు. అరెస్టును నిరసిస్తూ, అరాచక వైసీపీ పాలన నుంచి ప్రజలను రక్షించాలని, రాష్ట్రాభివృద్ధి కోసమే కలిసి పోరాటం చేయాలని 3 తీర్మానాలు చేశామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల తర్వాత టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడి రాష్ట్ర అభివద్ధి, ప్రజాసంక్షేమానికి పాటుపడుతుందన్నారు.

# వచ్చే రామనవమి అయోధ్యలోనే...!

(మొదటిపేజీ తరువాయి)
ఆయుధాలను పూజించడం సంప్రదాయమని, భూములను ఆక్రమించుకునేందుకు ఆయుధ పూజ చేయమని, సొంతగడ్డను రక్షించుకునేందుకు చేస్తామని చెప్పారు. "మన శక్తి పూజ కేవలం మన కోసం కాదు. యావత్ ప్రపంచ సంక్షేమం కోసం" అని అన్నారు.

**అయోధ్య రామాలయం చూసే భాగ్యం మనదే..**

ఇవాళ మనం చాలా అదృష్టవంతులమని, అయోధ్యలో భవ్య రామాలయాన్ని చూడబోతున్నామని మోదీ అన్నారు. వచ్చే రామనవమి అయోధ్యలో జరుగుతుందన్నారు. భవ్య రామాలయంలో రామచంద్రుని దర్శనానికి ఇక కొద్ది నెలలే మిగిలాయన్నారు. ఈ సందర్భంగా మోదీ సంప్రదాయబద్ధంగా 'ఆయుధ పూజ' నిర్వహించారు. ఈ వేడుకల్లో రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమాన్ వేషధారణలో ప్రదర్శనకు సిద్ధమైన కళాకారులకు మోదీ స్వయంగా తిలకం దిద్ది, హారతి పట్టారు. 'రావణ్ దహన్'లోనూ పాల్గొన్నారు.

# అభ్యర్థుల ఎంపికలో తప్పిదాలకు తావివ్వొద్దు

- స్క్రీనింగ్ కమిటీలో నేతల నిర్ణయం
- వామపక్షాల పొత్తు, అభ్యర్థుల ఎంపికపై చర్చ
- 26న సీఈసీ భేటీ అదే రోజు తుది జాబితా విడుదల..!

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణలో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం కనిపిస్తోందని, అందువల్ల మిగిలిన స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో ఎలాంటి తప్పిదాలకు తావివ్వొద్దని కాంగ్రెస్ నేతలు ఒక నిర్ణయానికి వచ్చారు. 55 స్థానాలకు ఈనెల 15న విడుదల చేసిన మొదటి జాబితాలో సిట్టింగ్ లు, మాజీలు, పార్టీ ముఖ్య నేతలు ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, అయితే పార్టీ అధికారంలోకి రావాలంటే మిగిలిన 64 సీట్లు కూడా కీలకమని గుర్తించారు. ఈ నేపథ్యంలో రెండో జాబితా విడుదలయ్యే స్థానాలపై క్షేత్ర స్థాయి నుంచి పరిశీలించి ఫైనల్ చేయాలని నిర్ణయానికి వచ్చారు. ఆదివారం ఢిల్లీలోని రకాబ్ గంజ్ గురుద్వారా రోడ్ లోని కాంగ్రెస్ వార్ రూంలో స్క్రీనింగ్ కమిటీ భేటీ అయింది. స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్ మురళీధరన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో సభ్యులు జిగేశ్ మేవాని, ఏఐసీసీ సెక్రెటరీ రోహిత్ చౌదరి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి, ఎన్నికల ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. దాదాపు రెండు గంటలకు పైగా సాగిన ఈ భేటీలో వామపక్షాలతో పొత్తు, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో అభ్యర్థుల ఎంపిక, మిగిలిన స్థానాలకు సంబంధించిన అభ్యర్థులపై చర్చించారు. వామపక్షాలకు కేటాయించే స్థానాలతో కూడిన జాబితాను కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ(సీఈసీ) కి పంపాలని నిర్ణయానికి వచ్చారు.

**26న సీఈసీ భేటీ**

అభ్యర్థుల తుది జాబితా కోసం మరోసారి స్క్రీనింగ్ కమిటీ భేటీ కానున్నట్టు తెలుస్తుంది. ఆ రోజే వామపక్ష పార్టీలతో పొత్తుపై స్పష్టత, వారికి సీట్ల కేటాయింపు, మిగిలిన స్థానాలకు అభ్యర్థులతో జాబితాను రూపొందించనున్నారు. అనంతరం కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ(సీఈసీ)కి ఆ జాబితాను పంపనున్నారు. కాగా ఈ నెల 26న సీఈసీ భేటీ కానుందని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. ఈ భేటీ తరువాత మిగిలిన స్థానాలకు సంబంధించిన జాబితా విడుదల కానుంది.

**తెలంగాణ లో ప్రభుత్వం మారుతుంది**

త్వరలో తెలంగాణలో ప్రభుత్వం మారనుందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ క్రికెటర్ అజారుద్దీన్ తో కలిసి ఢిల్లీలోని హజరత్ నిజాముద్దీన్ దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గాకు చాదర్ సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ%"% ఒక లౌకికవాదిగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతా లను నమ్మినవాడిగా దర్గాకు వచ్చానన్నారు. దేశంలోనే నిజాముద్దీన్ దర్గాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. హజ్రత్ నిజాముద్దీన్ దర్గాలో ఏది కోరుకుంటే అది జరుగుతుందని ప్రజలకు విశ్వాసం ఉందన్నారు. రాబోయే ఐదు రాష్ట్రాల్లో లౌకిక ప్రభుత్వాలు ఏర్పాటు కావాలని దర్గాలో ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించడం ద్వారా అందరికీ సంక్షేమం, అభివృద్ధి అందాలని కోరుకున్నట్లు వెల్లడించారు. హిందువులు-ముస్లింలు కలిసి ఉంటూ మతసామరస్యాన్ని కాపాడే విధంగా పరిపాలన అందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తుందన్నారు. దేశ గొప్పతనాన్ని కాపాడే ప్రయత్నం రాహుల్ గాంధీ చేశారని, ఈ దిశలో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు.

# 50 వేల మెజార్టీకి ఒక్క ఓటు తగ్గినా రాజకీయాల నుంచి వైదొలుగుతా



**సూర్యాపేట- ప్రభాత సూర్యుడు:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి 50వేల మెజార్టీతో గెలుస్తానని ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 50వేల మెజార్టీకి ఒక్క ఓటు తగ్గినా రాజకీయాల నుంచి వైదొలుగుతానని చెప్పారు. ఉత్తమ్ సమక్షంలో పలువురు బిఆర్ఎస్ నేతలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడారు. కాంగ్రెస్‌లోకి వచ్చే వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. సమన్వయంతో పని చేసి కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు.

# శంషాబాద్ ఎయిర్ పోర్టులో బంగారం పట్టివేత



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు భారీగా అక్రమ బంగారాన్ని పట్టుకున్నారు. దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఇద్దరు ప్రయాణికులు బంగారాన్ని తీసుకెళు న్నట్లు గుర్తించారు. దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికులపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ ప్రయాణికుడి బ్యాగులో 610 గ్రాముల బంగారం ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బంగారం విలువ సుమారు రూ.32.8 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మరో ప్రయాణికుడి వద్ద 483 గ్రాముల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు.

# యుకెలోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుండి ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం



**తెలంగాణ :** యుకెలోని ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం అందింది. ఈ నెల 30న యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమంలో 'డెవలప్‌మెంట్ ఎకనామిక్స్' అనే అంశంపై కవిత ప్రసంగించనున్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కీలకోపన్యాసం చేయనున్నారు. ఇటీవల బ్రిడ్జ్ ఇండియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడానికి లండన్‌లో పర్యటించిన సమయంలో యూనివర్సిటీ విద్యార్థులతో కల్వకుంట్ల కవిత భేటీ అయిన సంగతి విదితమే. దీంతో తెలంగాణ అభివృద్ధి మోడల్ పై ఈ నెల 30వ తేదీన ప్రసంగించాల్సిందిగా కోరుతూ యూనివర్సిటీ ఆహ్వానం పంపింది.

# రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ. పర్యటనలపై కాంగ్రెస్ ప్రకటన

**హైదరాబాద్- ప్రభాత సూర్యుడు:** పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పర్యటనలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ మంగళవారం వెల్లడించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 31న కొల్లాపూర్‌లో పాలమూరు ప్రజా భేరీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు సభ ఉంటుందని, ఈ సభకు ప్రియాంక గాంధీ వస్తున్నట్లు తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఆమె శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా కొల్లాపూర్ చేరుకుంటారన్నారు. ఇక వచ్చే నెల మొదటి వారంలో రాహుల్ గాంధీ పర్యటన ఉంటుందని, రెండో విడత బస్సు యాత్రలో ఆయన పాల్గొంటారని తెలిపారు. ఇక ఈ నెల 26, 27 తేదీల్లో తమ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీమ్‌లపై ప్రచారం చేస్తూ పార్టీ రాష్ట్రవ్యవహారాల ఇంఛార్జ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీనియర్ నేతలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పర్యటిస్తారన్నారు. రోజుకు రెండు నియోజకవర్గాల్లో పర్యటిస్తారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉందని, తమ పార్టీ అత్యధిక స్థానాలను గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## సంపాదకీయం

# 2024 కోసం మోడీ వ్యూహాలు

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్రం మరో మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా బీజేపీ సర్కారు ఓ విస్తృత కార్యక్రమాన్ని చేపట్టబోతోంది. దేశంలో చాలా మందికి ప్రభుత్వ పథకాలు అందడం లేదు. వారిలో చాలా మంది అర్హత ఉన్నా.. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. అలాంటి వారికి పథకాలు అందించేందుకు 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబోతోంది. దీని కింద దేశంలోని 2.7 లక్షల పంచాయతీల్లో మెగా డ్రైవ్ చేపట్టనుంది. ఈ డ్రైవ్‌లో ఆయా పథకాల అర్హులను గుర్తించి, వారికి ప్రయోజనాలు చేకూరేలా చర్యలు తీసుకోనున్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో అందేలా చూడాలని ప్రధాని నరేంద్ర మోడీఆరు నెలల లక్ష్యాన్ని నిర్దేశించారని అధికారిక వర్గాలు తెలిపాయి. ఇటీవల ఉన్నతాధికారులతో సమావేశమైన ప్రధాని మోదీ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. వచ్చే 6 నెలల్లో దేశంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు పూర్తిస్థాయిలో అందించాలని ఆదేశించారు. ఇప్పటికే ఈ విషయాన్ని గత కేబినెట్ సమావేశంలోనూ ప్రధాని ప్రస్తావించారు. కేంద్ర పథకాలను ప్రజలకు చేరువ చేసేలా దేశంలోని 2.7 లక్షల పంచాయతీల్లో అర్హులను గుర్తించాలని ప్రధాని ఆదేశించారు. ప్రజలకు పథకాలు అందించేందుకు మరింత కష్టపడి పనిచేయాలని, సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందని లబ్ధిదారులకు వేగంగా చేరేలా చూడాలని మంత్రులకు సూచించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇందు కోసం ప్రత్యేకంగా ప్రచార, అవగాహన రథాలు రూపొందించనున్నారు. వీటి ద్వారా ఈ 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' కొనసాగుతుందని అధికార వర్గాలు తెలిపాయి. దీపావళి తర్వాత ఈ కార్యక్రమం ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించాయి. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కింద అర్హులైన ప్రజలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ), పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమా యోజన, పోషణ్ అభియాన్, ఉజ్వల్ యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకాలు అందిస్తారు. అర్హత ఉండి పథకాలు అందుకోలేని వారికి అండగా నిలిచేలా ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాళ్ ప్రభుత్వం ఇలాంటి డ్రైవ్‌లను నిర్వహించాయి. ఏపీలో ఇటీవల జనన్న సురక్ష పేరుతో అర్హులైన వారికి పథకాలు అందించేలా ప్రత్యేక క్యాంపులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి అర్హులను గుర్తించారు. వలంటీర్ల సాయంతో ప్రత్యేకంగా టోకన్లు జారీ చేయించారు. ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అక్కడిక్కడే ప్రత్యేకంగా సర్టిఫికెట్లు మంజూరు చేశారు. అర్హులైన వారికి పథకాలు వర్తింపజేశారు. ఆధార్ అప్‌డేట్లు, ఫోన్ నెంబర్ లింక్, కుల, ఆదాయ సర్టిఫికెట్లను క్యాంపుల్లోనే మంజూరు చేసి పథకాలకు దరఖాస్తు చేయించారు. అర్హత ఉండి దరఖాస్తు వారికి రేషన్ కార్డులు తక్షణం మంజూరు చేశారు. పశ్చిమ బెంగాల్లో సైతం ఇలాంటి డ్రైవ్ జరిగింది. అర్హులకు పథకాలు అందించేందుకు మమత సర్కార్ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. రాబోయే ఆరు నెలల్లో తన పథకాలన్నీ పూర్తి స్థాయికి చేరుకోవాలని తాను కోరుకుంటున్నానని" ఒక మూలాధారం తెలిపింది. ఈ డ్రైవ్ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీన్), జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, పీఎం కిసాన్, ఫసల్ బీమా యోజన, పోషణ్ అభియాన్, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, జనౌషధి యోజన మరియు పీఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన వంటి పథకాల సంతృప్తతను నిర్ధారిస్తుంది. నైపుణ్యాభివృద్ధి పథకాలు మరియు ఇటీవల ప్రారంభించిన విశ్వకర్మ యోజనతో పాటు, వారు చెప్పారు. సంక్షేమ పథకాల సంతృప్త ఆవశ్యకతను మోదీ పదే పదే నొక్కిచెప్పారు, అటువంటి విధానం ఎలాంటి వివక్షను కూడా తోసిపుచ్చుతుందని మరియు అర్హులైన ప్రతి పౌరునికి సంక్షేమ కార్యక్రమాలను అందజేస్తుందని నొక్కి చెప్పారు. వచ్చే ఏడాది ఏప్రిల్-మేలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు అధికార బీజేపీ సన్నద్ధమవుతున్న తరుణంలో, పార్టీని వరుసగా రెండు వైపులా నడిపించిన తర్వాత వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలని కోరుతున్న మోడీ నాయకత్వంలో ఈ సంతృప్త డ్రైవ్ వచ్చింది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో భారీ విజయాలు. గ్వాలియర్‌లోని సింధియా స్కూల్ స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో మోదీ ప్రసంగిస్తూ, పేదరికాన్ని అరికట్టేందుకు సంక్షేమ చర్యలపై తమ ప్రభుత్వం దృష్టి సారిస్తోందని అన్నారు. కనీసం ఒక్క పేద కుటుంబమైనా చేయి చేయి వేయాలని ఆయన ప్రేక్షకులకు చెప్పారు. వంటగ్యాస్, గృహాలు, బ్యాంకు ఖాతాలు, ఆరోగ్య బీమా సహా ప్రతి పేద వ్యక్తి సంక్షేమ పథకాల పరిధిలోకి వచ్చే వరకు విశ్రమించకూడదని మోదీ అన్నారు. భారతదేశాన్ని పేదరికం నుండి విముక్తి చేయాల్సిన అవసరం ఉందని, ఈ మార్గాన్ని అనుసరించి, 13.5 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుండి బయటపడారని, ఈ మార్గాన్ని అనుసరిస్తే, భారతదేశం కూడా పేదరికాన్ని తొలగించి అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.

# దసరా తర్వాత రెండో జాబితా

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

దసరా పండుగ తర్వాత తమ పార్టీ అభ్యర్థుల రెండో జాబితాను ప్రకటిస్తామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేతను స్వాగతిస్తున్నామన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసుకుంటున్న లక్ష్మీబ్యారేజీ ఫిల్లర్లు కుంగిపోయాయని విమర్శించారు. ప్రాజెక్టు పరిశీలనకు వెళ్లిన రాజకీయ నాయకులను, ఇంజినీర్లను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమని పేర్కొన్నారు. లక్షన్నర కోట్ల రూపాయల ప్రాజెక్ట్ పతనమవుతుంటే ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణంపై ఇంజినీర్లకూ అనేక అనుమానాలున్నాయని చెప్పారు. సీఎం కేసీఆర్ 80వేల పుస్తకాలు చదివి సూపర్ ఇంజినీర్ అవతారమెత్తి నిపుణుల మాటలు ఖాతరు చేయకుండా ప్రాజెక్టు కట్టించారని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం ఇష్టానుసారంగా పెంచి రాష్ట్ర సంపదను కేసీఆర్ కొల్లగొట్టారని ఆరోపించారు. 52 మంది అభ్యర్థులతో ప్రకటించిన తమ తొలి జాబితాలో మాజీ శాసనసభ్యులు, మాజీ ఎంపీలు, మున్సిపల్ చైర్మెన్లు, తదితరులు చోటు దక్కించుకున్నారని చెప్పారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో ప్రధాని ఐదు సభల్లో, అమిత్ షా మూడు సభల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ నెల 27న అమిత్‌షా మరోసారి రాబోతున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమ పార్టీ అనుకూలంగా మలుచుకుంటున్నదన్నారు.

# విజయం కోసం గులాబీ వ్యూహాలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పార్టీలు ప్రచారంలో దూకుడు పెంచాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాజకీయ పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు విజయం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రకటించడంలో నిమగ్నమైతే, బీఆర్ఎస్ మాత్రం అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ విరామం లేకుండా రాష్ట్రాన్ని చుట్టేస్తున్నారు. హ్యాట్రిక్ కొట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఆ పార్టీ అభ్యర్థులు కూడా ఇప్పటికే ఒక విడత ప్రచారాన్ని పూర్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేస్తోంది. సానుకూల అంశాలతో ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు విపక్షాల విమర్శలు తిప్పికొట్టేందుకు సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించనుంది. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ కొత్త వ్యూహాలకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ వ్యాప్తంగా 119 వార్‌రూమ్‌లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర స్థాయి వార్‌రూమ్‌ను కేటీఆర్, హరీశ్‌రావు పర్యవేక్షించనున్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా బూత్‌స్థాయిలో ప్రచార ప్రణాళికల రూపకల్పనకు నియోజకవర్గాల వారీగా వార్‌రూమ్‌లను ఏర్పాటు చేసింది. నియోజకవర్గ ఇంఛార్జ్ నేతృత్వంలోని ఒక్కో వార్ రూమ్‌లో 350 మందిని నియమించారు. నేడు తెలంగాణ భవన్‌లో వార్‌రూమ్ ప్రతినిధులతో కేటీఆర్ సమావేశం కానున్నారు. వార్ రూమ్ ప్రతినిధులకు పోలింగ్ ముగిసే వరకూ ఎలా వ్యవహరించాలో కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ఏయే నియోజకవర్గంలో పరిస్థితులు ఎలా ఉన్నాయి ? ప్రచారంలో ఎలాంటి వ్యూహాలను అనుసరించాలి ? అభ్యర్థులకు ఎలాంటి సలహాలు ఇవ్వాలన్న దానిపై రాష్ట్ర స్థాయి వార్‌రూమ్‌లో పరిస్థితిని విశ్లేషించి ఎప్పటికప్పుడు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. ఎన్నికల మేనిఫెస్టోను ప్రతి ఓటరుకు చేరేలా ప్రచారం నిర్వహిస్తారు. తొమ్మిదిన్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ప్రచారాస్త్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా వార్‌రూమ్ కార్యక్రమాలు జరగనున్నాయి.

ఓటర్లను నాలుగు కేటగిరీలుగా విభజించి ఎవరిని ఎలా ఆకట్టుకోవాలో ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేస్తారు. సానుకూల అంశాలతో ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు విపక్షాల విమర్శలు తిప్పికొట్టేందుకు సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించనుంది. ప్రతి బూత్‌లోని మెజార్టీ ఓట్లు పడేలా బీఆర్ఎస్ ప్రత్యేక వ్యూహాలను తయారు చేసింది. రాష్ట్రంలోని 3.17 కోట్ల ఓటర్లను నాలుగు కేటగిరీలుగా గులాబీ పార్టీ విభజించింది. కార్యకర్తలు, కచ్చితంగా భారత్ రాష్ట్ర సమితికే ఓటు వేస్తారని భావించే వారు ఏ కేటగిరీలో, ఏ పార్టీకి వేయాలో తేల్చుకోలేని ఓటర్లను బీ కేటగిరీగా విభజించింది. బీఆర్ఎస్‌పై కోపంతో ఉన్న ఓటర్లను సీ కేటగిరీ కింద, ఇతర పార్టీల కార్యకర్తలు, భారత్ రాష్ట్ర సమితికి ఓటు వేయరని భావించే వారిని డీ కేటగిరీలో చేర్చింది. ఒక్కో కేటగిరీ ఓటర్లకు ఒక్కో ప్రత్యేక వ్యూహాన్ని వార్ రూంలు అమలు చేయనున్నాయి. 4 కేటగిరీల ఓటర్లను వివిధ స్థాయిల్లో ఒప్పించి తమవైపు తిప్పుకునేందుకు ఎలాంటి అస్త్రాలు అవసరమో వాటిని వార్‌రూమ్‌లో నిర్ణయిస్తారు. ఇప్పటికే మూడంచెల ప్రచార వ్యూహాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్.. సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మేనిఫెస్టో, ఇతర ప్రచారాస్త్రాలు, సానుకూల అంశాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారంలోకి తీసుకెళ్తారు.

## గజ్వేల్ నుంచి ఈటెల, కామారెడ్డి నుంచి రేవంత్

### ఈ సారి మాములుగా లేదుగా




**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ రెండు చోట్ల పోటీ చేస్తూండటాన్ని బీజేపీ, కాంగ్రెస్ అడ్వాంటేజ్ గా తీసుకుంటున్నాయి. ఆయనకు ఓటమి భయం ఉందని భావిస్తున్నాయి. దానికి తగ్గట్లుగా వ్యూహాత్మకంగా ఆయనపై రెండు చోట్ల బలమైన అభ్యర్థులను నిలబెట్టాలని అనుకుంటున్నాయి. ఈ క్రమంలో గజ్వేల్‌లో ఈటల రాజేందర్ పోటీ చేస్తానని అంటున్నారు. హైకమాండ్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చెబుతున్నారు. అదే సమయంలో కామారెడ్డిలో తాను పోటీ చేస్తానని విజయశాంతి అంటున్నారు. కానీ అక్కడ బీజేపీ అభ్యర్థిపై చర్చ లేదు. ఇప్పుడు అక్కడ రేవంత్ రెడ్డిని పోటీ చేయించాలన్న ఆలోచన కాంగ్రెస్ హైకమాండ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. తెలంగాణ సీఎం కేసీఆర్‌పై రేవంత్ రెడ్డిని పోటీకి పెట్టాలని కాంగ్రెస్ హైకమాండ్ భావిస్తున్నట్లుగా ఆ పార్టీ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. కామారెడ్డి నుంచి కేసీఆర్ పై రేవంత్ రెడ్డి గట్టి ప్రత్యర్థి అవుతారన్న అభిప్రాయంతో ఇప్పటికే సునీల్ కనుగోలు టీమ్ సర్వేలు చేస్తోందని అంటున్నారు. గజ్వేల్ ను వదిలిపెట్టి పోనని కామారెడ్డిలో పోటీకి ఓ కారణం ఉందని కేసీఆర్ చెబుతున్నారు. దీంతో కామారెడ్డిలో వ్యతిరేక ప్రచారం జరుగుతోంది. గెలిచినా రాజీనామా చేస్తారని ఆయన కుటుంబసభ్యుల్లో ఒకరిని మళ్లీ గెలిపిస్తారని బావిస్తున్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గంప గోవర్ధన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ మీద కేవలం ఐదు వేల ఓట్ల తేడాతోనే గెలిచారు. కాంగ్రెస్ పార్టీకి మంచి పట్టు ఉన్న నియోజకవర్గం. అయితే కేసీఆర్ దెబ్బకు షబ్బీర్ అలీ నిలబడలేరని.. రేవంత్ అయితే ముఖాముఖి పోరు జరుగుతుందని భావిస్తున్నారు. కొడంగల్ తో పాటు కామారెడ్డిలో కూడా రేవంత్ రెడ్డి పోటీ చేయాలని హైకమాండ్ ఆదేశిస్తే ఆయన పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. కేసీఆర్ ను ఓడించడం అంటే... కాంగ్రెస్ పార్టీ గెలిస్తే.. ముఖ్యమంత్రి రేసులో ఎవరికీ అందనంత ఎత్తులో ఉంటారు. అందుకే.. రేవంత్ రెడ్డి కూడా రెడీ అనే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అయితే ఈ అంశంపై హైకమాండే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కామారెడ్డిలో బీజేపీకి పెద్దగా బలం లేదు. బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేస్తున్న గజ్వేల్ నుంచి తాను బిజెపి అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ఆయన ప్రకటించారు. బీజేపీ హైకమాండ్ కూడా రెండు చోట్ల ఆయనకు టిక్కెట్ ఇచ్చేందుకు అంగీకరించిందని అంటున్నారు. కేసీఆర్ పై బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ పోటీ చేస్తే ఆయనకు మద్దతుగా నిలుస్తామని అసంతృప్త నేతలు కొంత మంది ప్రకటనలు చేశారు. గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ టేకులపల్లి రామిరెడ్డి, మాజీ ఎంపీపీ రాజు, జడ్పీటిసి మాజీ సభ్యుడు సింగం సత్తయ్యతో పాటు పలువురు సర్పంచులు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కెసిఆర్ కు వ్యతిరేకంగా పనిచేయాలని నిర్ణయం తీసుకున్నామని ఈటలకుమద్దతుగా ఉంటామని వారంటున్నారు. బీఆర్ఎస్ అసంతృప్త నేతల మద్దతు సంపూర్ణంగా దొరుకుతుందన్న భావనలో ఉన్న ఈటల రాజేందర్ గజ్వేల్ నియోజకవర్గంలో పోటీ చేస్తే కెసిఆర్ పై గెలుస్తానని ధీమాతో ఉన్నారు. గజ్వేల్ లో కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డినిప్రకటించారు. గజ్వేల్‌లో కొన్ని సమస్యలు ఉన్నాయని.. పార్టీ నేతలు అసంతృప్తిగా ఉన్నారని గుర్తించిన కేసీఆర్ ఇప్పటికే అక్కడి క్యాడర్ ను పిలిచించి మాట్లాడారు. శుక్రవారం ఓ ఫంక్షన్ హాల్లో సమావేశం అయ్యారు. అందరికీ క్లారిటీ ఇచ్చారు తాను నెలకో రోజు కేటాయిస్తానని హామీ ఇచ్చారు సమస్యలు పరిష్కరిస్తానన్నారు. బుజ్జగింపుల తరహాలో మాట్లాడారు. మెజార్టీ మీ దయ అని వ్యాఖ్యానించడం ద్వారా కేసీఆర్ రక్షణాత్మక ధోరణిలో ఉన్నారని భావిస్తున్నారు. మరో వైపు కామారెడ్డిలో పోటీ ఎంత పాజిటివ్ వస్తుందన్నది కూడా ఇంకా తేలలేదు. కేసీఆర్ పై రేవంత్ లాంటి బలమైన అభ్యర్థి నిలబడితే.. రెండు నియోజకవర్గాలపై కేసీఆర్ ఎక్కువ సమయం కేటాయించాల్సి రావొచ్చని భావిస్తున్నారు.

# మజ్లిస్ ఓటు ఎవరికి చేటు




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణతో పాటు మరో ఐదు రాష్ట్రాలు జరుగుతున్నాయి. మజ్లిస్ ఇత్తెహదుల్ ముస్లిమీన్ .. మజ్లిస్ లేదా ఎంఐఎం మిజోరం మినహా నాలుగు రాష్ట్రాల్లోనూ పోటీ చేస్తోంది. తెలంగాణలోనూ పోటీ చేస్తోంది. అయితే ఏడెనిమిది స్థానాల్లోనే పోటీ చేస్తుంది. కానీ మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్ ఘడ్‌లలో మాత్రం పదుల సంఖ్యలో పోటీ చేస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న మజ్లిస్ తెలంగాణలో అతి తక్కువ పోటీ చేసి.. ఇతర రాష్ట్రాల్లో ఎందుకు ఎక్కువగా పోటీ చేస్తోంది. దీనికి ఒకే ఆన్సర్ కాంగ్రెస్ ను దెబ్బకొట్టడమేనని చెబుతున్నారు. తెలంగాణలో ప్రధాన పోటీ అధికార బిఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్యే ఉందని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. కొన్ని చోట్ల బిజెపి ప్రభావం చూపే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అనధికారిక మిత్రపక్షమైన ఎంఐఎం ఇప్పటికే బిఆర్ఎస్‌కు పూర్తి మద్దతు తెలిపింది. పరిమిత స్థానాల్లో పోటీ చేసే ఎంఐఎం రాష్ట్ర వ్యాప్తంగా మిగతా స్థానాల్లో బిఆర్ఎస్‌ను బలపరుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని అనుకుంటోంది. తాము పోటీ చేసే పాతబస్తీలోని 7 నియోజకవర్గాలు మినహా మిగితా స్థానాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను బలపరుచాలని ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసి ఇప్పటికే పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దాదాపు 12.7 శాతం ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వారున్నారు. మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 40 నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీల భవితవ్యాన్ని నిర్ణయించే స్థితిలో ముస్లిం ఓటర్లు ఉన్నారని రాజకీయ నిపుణులు అంటున్నారు. హైదరాబాద్‌లో ముస్లింలు పెద్ద సంఖ్యలో నివసిస్తున్నారు. పాతబస్తీలోని ఏడు అసెంబ్లీ స్థానాలు మజ్లిస్ పార్టీకి పెట్టని కోటలా ఉన్నాయి. కాగా తెలంగాణలోని దాదాపు అన్ని జిల్లాల్లో ముస్లింలు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నల్గొండ, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ముస్లింలు అధికంగా ఉన్నారు. తెలంగాణ సామాజిక అభివృద్ధి నివేదిక- 2017 ప్రకారం, హైదరాబాద్‌లోనే 1.73 మిలియన్ల మంది ముస్లింలు నివసిస్తున్నారు, ఇది నగర జనాభాలో నాల్గవ వంతు, రాష్ట్ర ముస్లిం జనాభాలో 43.5 శాతం నగరంలోని 24 అసెంబ్లీ స్థానాల పరిధిలో ఉన్నారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో నూ మజ్లిస్ పార్టీకి మంచి పట్టు ఉన్నట్లు భావిస్తున్నారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ ముస్లింలు టిఆర్ఎస్‌కు మద్దతిచ్చారు. ఈ సారి ముస్లిం ఓట్లు గంపగుత్తగా బిఆర్ఎస్‌కు పడకుండా కాంగ్రెస్ గట్టి ప్రయత్నాలు చేస్తోంది. దీంతో కాంగ్రెస్‌ను అధికారంలోకి రాకుండా నిలువరించేందుకు ఓవైసి బ్రదర్స్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారని అంటున్నారు. అయితే జాతీయ పరిణామాల కోణంలో ఆలోచిస్తే.. మజ్లిస్ పార్టీ.. కాంగ్రెస్ ను బలహీనపర్చడం ద్వారా బీజేపీకి మేలు చేస్తుందన్న అభిప్రాయానికి ముస్లింలు వస్తున్నారని అంటున్నారు. అందుకే కొంత మందిలో మార్పు వస్తోందని చెబుతున్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు ప్రకటించినా అమలు చేయకపోవడాన్ని ముస్లింలలో కొంతమంది వేలెత్తి చూపుతున్నారు. ఈ కారణంగా ముస్లిం ఓటింగ్ కొంత కాంగ్రెస్ వైపు మళ్లే చాన్స్ ఉందని భావిస్తున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్ ఘడ్ లలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న చోట్ల మజ్లిస్ పోటీ చేస్తోంది. నిజానికి గత కొన్నేళ్లుగా పోటీ చేస్తూనే ఉంది. అయితే ఎక్కడ పోటీ చేసినా కాంగ్రెస్ కు పడాల్సిన ఓట్లను చీల్చడం ద్వారా ఆ పార్టీకి నష్టం చేసి బీజేపీకి మేలు చేస్తున్నారన్న ఆరోపణలు మాత్రం బలంగా వస్తున్నాయి. మహారాష్ట్రలో కాంగ్రెస్ కూటమి ఓటమికి మజ్లిస్ కారణం. బీహార్ లోనూ అంతే అని చెబుతున్నారు. ఈ కారణంగానే తెలంగాణ ఓటర్లలో మార్పు వస్తోందని భావిస్తున్నారు. కారణం ఏదైనా కాంగ్రెస్ ను మజ్లిస్ వర్గ శత్రువుగా ప్రకటించుకుంది. బీజేపీకి మేలు చేస్తూనే ఉంది. ఈ సారి కూడా అదే వ్యూహం అమలు చేస్తోంది.

## బంగ్లాదేశ్‌లో రెండు రైళ్ల ఢీ.. 15 మంది మృతి



**బంగ్లాదేశ్- ప్రభాత సూర్యుడు :** బంగ్లాదేశ్‌లో రైలు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రాథమిక సమాచారం మేరకు ఈ ఘటనలో 15 మంది వరకు మృతి చెందగా, 100 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటనలో మృతులు, గాయపడిన వారి సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని తెలుస్తోంది. ఏఎఫ్‌పీ సమాచారం మేరకు బైరబ్ ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. అయితే ఓ గూడ్స్ రైలు%ా% ప్రయాణికులతో కూడిన మరో రైలు పైకి దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ రెండు రైళ్లు ఎదురెదురుగా వస్తున్నాయి. ప్రయాణికులు ఉన్న రైలులోని రెండు బోగీలు పట్టాలు తప్పాయి. ఘటన జరిగిన ప్రాంతం ఢాకాకు 60 కిలో మీటర్ల దూరంలో ఉంది. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని ప్రభుత్వ అధికారి సాధిక్ రహ్మాన్ తెలిపారు. బంగ్లాదేశ్‌లో సరిగ్గా లేని సిగ్నల్ వ్యవస్థ, నిర్లక్ష్యం, పాత ట్రాక్స్ వల్ల తరుచూ రైలు ప్రమాదాలు జరుగుతుంటాయి.

## 119 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు

### రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ 119 స్థానాల్లో అభ్యర్థులను నిలబెడుతుం దని తెలుగుదేశం తెలంగాణ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ స్పష్టం చేశారు. పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా బలమైన నాయకత్వం ఉందన్నారు. ఆదివారం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. .ఈ సమావేశంలో పోలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు,పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు,అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జీలు ,నియోజకవర్గ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన కాసాని మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఖమ్మం బహిరంగ సభ, ఇంటింటికి తెలుగుదేశం, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 41వ పార్టీ ఆవిర్భావ సభ, కరీంనగర్ శంఖారావం సభ, 17 పార్లమెంట్ నియోజక వర్గాలలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు, మినీ మహానాడులు, ఇందిరా పార్క్ దర్నాచౌక్ వద్ద ప్రభుత్వ హామీలు-వైఫల్యాలపై మహాధర్నా తదితర ఆందోళనా కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు.

## మద్యం ధరల పెంపు



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** హెూటల్స్, బార్స్‌లో విక్రయించే మద్యంపై వ్యాట్? పెంచాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం.. ఈ నవంబర్? 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ మేరకు మహా సర్కార్ నోటిఫికేషన్?ను విడుదల చేసింది. మహారాష్ట్రలో లిక్కర్?పై వచ్చే జీఎస్టీ రాబడి చాలా అధికంగా ఉంటుంది. ఇక ముంబైలోని 3 స్టార్ కన్నా తక్కువ రేటింగ్? ఉన్న హెూటల్స్?లో మద్యం సేవలపై మరింత ట్యాక్స్? పెంచాలని అక్కడి యంత్రాంగం భావిస్తోందని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం 5శాతంగా ఉన్న ట్యాక్స్.. 10-15శాతం వరకు చేరొచ్చని తెలుస్తోంది. ఇదే జరిగితే.. ప్రభుత్వానికి వార్షికంగా రూ. 300 కోట్ల నుంచి రూ. 600కోట్ల వరకు అదనంగా రెవెన్యూ జనరేట్ అవుతుంది.

## కాళేశ్వరం' భద్రతను పరిశీలించేందుకు మంగళవారం తెలంగాణకు రానున్న కేంద్ర బృందం

**- కేంద్ర జలవనరుల సంఘం సభ్యుడు అనిల్ జైన్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కమిటీ**

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** కాళేశ్వరం ప్రాజెక్టులోకి ముఖ్య భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజ్ పిల్లర్లు కుంగిన నేపథ్యంలో.. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి డ్యామ్ భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. బ్యారేజీ భద్రతను పరీక్షించేందుకు కేంద్ర బృందాన్ని పంపాలంటూ.. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర షెకావత్కు లేఖ రాశారు. దీనికి స్పందించిన కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్ కేంద్ర బృందాన్ని పంపాలని నిర్ణయించారు. . కేంద్ర జలవనరుల సంఘం సభ్యుడు అనిల్ జైన్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కమిటీ ఏర్పాటైంది. ఈ బృందం ఇవాళ తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై.. రేపు కాళేశ్వరం డ్యామ్ ను సందర్శించనుంది. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడం దురదృష్టకరం. 6వ బ్లాక్లోని గేట్ నెంబర్ 15 నుంచి 20 వరకు కుంగిపోయాయి. సందర్భంగా పెద్దగా శబ్దాలు వచ్చినట్లు స్థానికులు చెప్పారు. దీంతో బ్యారేజ్ లోని 85 గేట్లను తెరిచి నీటిని దిగువకు వదిలేశారు. గునీటికోసం జమచేసిన నీళ్లన్నీ వ్యర్థంగా కిందికి వదలాల్సి వచ్చింది. దీని కారణంగా దిగువన ఉన్న ప్రాంతాల ప్రజలు రాత్రంగా భయంభయంగా గడిపారు.

# పక్కా ప్లాన్‌తో బీజేపీ

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న భారతీయ జనతా పార్టీ మొదటి అభ్యర్థుల జాబితా విడుదలైంది. మిషన్ తెలంగాణ..! టార్గెట్-2023! భారతీయ జనతా పార్టీ హైకమాండ్ తెలంగాణపై స్పెషల్‌గా ఫోకస్ చేస్తోంది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు తొలి జాబితాను ప్రకటించిన భారతీయ జనతా పార్టీ.. ప్రచారంపై దృష్టి సారించింది. తెలంగాణలో ఎలాగైనా అధికారంలోకి రావాలనుకుంటున్న కమలం పార్టీ.. కొత్త స్ట్రాటజీని అమలు చేయబోతోంది. బీజేపీ అధిష్టానం డైరెక్ట్‌గా తెలంగాణలో పార్టీ పరిస్థితిపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. స్థానిక నేతల్లో జోష్ నింపడమే లక్ష్యంగా జాతీయ స్థాయి నేతలు వరుస పర్యటనలు చేయనున్నారు.రాష్ట్రంలో ఎన్నికలను పూర్తిస్థాయిలో పార్టీ అధినాయకత్వమే పర్య వేక్షిస్తోంది. పార్టీకి సంబంధించిన ప్రతీ కార్యక్రమం రూపకల్పన కూడా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. వరుస సమావేశాలు.. సామాజిక సమీకరణాలు.. అంతకుమించి అన్నట్టు సుదీర్ఘ కసరత్తు తర్వాత బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా సిద్ధం చేశారు బలాలు, బలహీనతల ప్రాతిపదికగా అభ్యర్థుల్ని ఎంపిక చేసింది అధినాయకత్వం. ఎంపికలో ఎస్సీ, బీసీ, ఎస్టీ, జనరల్ అన్ని వర్గాలకు తగిన ప్రాధాన్యత దక్కేలా జాగ్రత్తలు తీసుకున్నారు.తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేసే ఫస్ట్ లిస్టులో మొత్తం 52 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఈ లిస్ట్ కు బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ కూడా ఆమోద ముద్ర వేసింది. ఎన్నికల బరిలో తెలంగాణ ముఖ్యనేతలందరికి అవకాశం కల్పిస్తూ బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ నిర్ణయం తీసుకుంది. మొదటి లిస్టులో బీసీలతో పాటు సీనియర్ల నేతలకు స్థానం కల్పించారు.ముగ్గురు పార్లమెంటు సభ్యులు సైతం ఈసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. కరీంనగర్ నుంచి బండి సంజయ్ కుమార్, బోథ్ నియోజకవర్గం నుంచి సోయం బాపూరావు, కోరుట్ల స్థానం నుంచి ధర్మపురి అర్వింద్ బరిలోకి దిగుతున్నారు.పార్టీ ముఖ్య నేత, సీనియర్ అయిన ఈటల రాజేందర్‌ను ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూరాబాద్ నుంచే కాక కేసీఆర్ పోటీకి దిగుతున్న గజ్వేల్ నుంచి కూడా బీజేపీ పోటీకి దింపనుంది. రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేయగా.. ఆయన మరోసారి గోషామహల్ నుంచి పోటీ చేయనున్నారు. తెలంగాణ ఎంపీలు నలుగురు నుంచి ముగ్గురిని శాసనసభ ఎన్నికల్లో దింపాలని పార్టీ నాయకత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది.వరుస భేటీలు.. వడపోతలు.. సుదీర్ఘ కసరత్తు చేసిన కేంద్ర ఎన్నికల కమిటీ.. బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేశారు. బలాలు, బ్యాగ్రౌండ్, సామాజిక సమీకరణాల ప్రాతిపదికగా అభ్యర్థుల్ని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఎంపికలో ఎస్సీ, బీసీ, ఎస్టీ, జనరల్ అన్ని వర్గాలకు తగిన ప్రాధాన్యత దక్కేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈసారి తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బీసీ కార్డ్‌తో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగా బీసీ నేతను సీఎం అభ్యర్థిగా ప్రకటించాలని భావిస్తోంది బీజేపీ అధిష్టానం. ఎన్నికల్లో బీసీ నినాదం తమకు తిరుగులేని అస్త్రంగా మారుతుందని లెక్కలేసుకుంటోంది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ తన తొలి జాబితాలో బీసీలు, మహిళలకు పెద్దపీట వేశారు. 20 మంది బీసీలు, 12 మంది మహిళలకు చోటు కల్పించారు. 8 మంది ఎస్సీలు, ఆరుగురు ఎస్టీలకు అవకాశమిచ్చారు. ఇక రెడ్డి సామాజిక వర్గానికి 12 స్థానాలు, వెలమలు 5 స్థానాలు, వైశ్యాలు ఒక్క స్థానం కేటాయించింది బీజేపీ అధినాయకత్వం. ఇక తొలి జాబితాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ పేరును మాత్రం అధిష్టానం చేర్చలేదు. వీరు అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉండి ప్రచార బాధ్యతలు నిర్వహిస్తారని తెలుస్తుంది. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, విజయశాంతి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, వివేక్ పేర్లను తొలి జాబితాలో చేర్చలేదు. వారు పోటీ చేసే స్థానాలపై కొంత సందిగ్ధత కొనసాగుతుంది. ఈ నేపథ్యంలోనే రెండో జాబితాలో వీరి పేర్లు ఉండే అవకాశమున్నట్లు సమాచారం.

# కేంద్ర బలగాల పహారాలో తెలంగాణ

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**




తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాచకొండ పోలీసు సిబ్బందికి సహాయంగా ఏడు కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు వచ్చేశాయి. ఇవి తొలి విడత బలగాలు కాగా త్వరలో మరిన్ని కేంద్ర బలగాలు రానున్నాయి. రాచకొండ పోలీస్ సిబ్బందితో కలిసి ఈ కేంద్ర బలగాలు పలు నియోజకవర్గాల్లో ఫ్లాగ్ మార్చ్ వంటి కవాతు నిర్వహించనున్నాయి.తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని రాచకొండ పోలీస్ కమిషనర్ డి ఎస్ చౌహాన్ తెలిపారు. ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పాత నేరస్తులను ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా బైండోవర్ చేస్తున్నామన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అవసరమైన ప్రదేశాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అక్రమ నగదు తరలింపు వంటి నేరాలను అడ్డుకునేందుకు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నమని, సరైన పత్రాలు లేకుండా నగదు తదితర వస్తువులు తీసుకెళితే సీజ్ చేస్తున్నట్లు తెలిపారు.మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల సందర్భంగా ఎలాంటి సమస్యలు అవకతవకులు చోటుచేసుకోకుండా ఉండేందుకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తుంది. అందులో భాగంగా భారీ భద్రత ఏర్పాటు చేసేందుకు కేంద్ర బలగాలను రంగంలోకి దింపనుంది. గతంలో పది వేల కేంద్ర బలగాలు తెలంగాణ వ్యాప్తంగా భద్రత కింద ఉంటే.. ఈసారి దాన్ని రెట్టింపు చేస్తూ 20 కేంద్ర బలగాలను హోం శాఖ కేటాయించింది. ఒక్కో కంపెనీలో అస్సాం రైఫిల్స్ బోర్డర్స్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్, శశాస్త్ర సీమా నుండి 80 మంది సిబ్బంది విధుల్లో ఉంటారు. ఈ సిబ్బంది అంతా తెలంగాణ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నారు.కేంద్ర పారా మిలిటరీ బలగాలు లెక్కల్లో చూపని నగదు అక్రమ మద్యం రవాణాను అరికట్టడానికి రాష్ట్ర సరిహద్దుల దగ్గర ఇలాంటి శిబిరాలను ఏర్పాటు చేయడమే కాకుండా కీలకమైన ప్రాంతాల్లో తాత్కాలిక భద్రత తనిఖీ శిబిరాలను ఏర్పాటు చేస్తాయి. ముందస్తుగా ఈ బలగాలు ఫ్లాగ్ మార్చును నిర్వహించడం ద్వారా ఓటర్లలో భయాన్ని పోగొట్టడానికి సమస్య ఆత్మక ప్రాంతాల్లో దశలవారీగా భద్రత కింద ఉండనున్నారు.

# అదిలాబాద్‌లో అలకలు

**అదిలాబాద్- ప్రభాత సూర్యుడు**

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ టికెట్ల జాబితాను ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే టికెట్లు ఖరారైన అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఇది ఇలా ఉండగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ల లొల్లి కొనసాగుతోంది. బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్ ఎవరికి ఇస్తారనే చర్చ కొనసాగు తోంది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజ కవర్గ ఎమ్మెల్యే రేఖా నాయక్ నియోజక వర్గంలో రెండుసార్లు గెలుపొందారు. అయితే ఈసారి బీఆర్ఎస్ టికెట్ కేటాయించకపోవడంతో ఆమె తిరుగుబాటు వేశారు. మొదటి నుంచి చెబుతున్నట్లుగా ఆమె ఆర్మూర్ లో జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇదే కోవలో బోథ్ ఎమ్మెల్యే బాబురావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇద్దరు ఎస్టీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు అయినప్పటికీ వారికి బీఆర్ఎస్ టికెట్ కేటాయించలేదు. అప్పటి నుంచి ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు ఆగ్రహంతో ఉన్నారు. దశాబ్ద కాలంగా పార్టీకి ప్రజలకు సేవలందిం చినప్పటికీ బీఆర్ఎస్ పార్టీ గుర్తించలేదని పేర్కొన్నారు.రాహుల్ గాంధీ సమక్షంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు బాబురావు, రేఖ నాయక్ లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారి చేరికను కాంగ్రెస్ జిల్లా నాయ కులు రాష్ట్ర నాయకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నప్పటికీ వారికి కాంగ్రెస్ టికెట్ దక్కుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇదే తరహాలో ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తూ ఎమ్మెల్యే రేఖా నాయక్ భర్త శ్యాం నాయక్ తన ఆర్టీవో ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇదిలా ఉంటే ఇటు ఖానాపూర్ లో అటు ఆసిఫాబాద్ లో కాంగ్రెస్ టికెట్ తమకే ఇస్తున్నట్లు ప్రచారాలు కొనసాగిస్తున్నారు, ఇప్పటికే కాంగ్రెస్ లో గోండు సామాజిక వర్గం నుంచి వెడమ బొజ్జు , లంబాడ సామాజిక వర్గం చారులత మరికొందరు, పార్టీ టికెట్ పై ఆశలు పెట్టుకుని సేవలు చేస్తున్నారు.అధిష్టానం ఒకే ఇంట్లో ఇద్దరికి టికెట్ ఇస్తుందా? లేదా ఒకరికి ఇచ్చి మరొకని బుజ్జగిస్తుందా? అని ప్రజలు వేచి చూస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఓడించడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీలో చేరిన రేఖా నాయక్ తన ఓటు బ్యాంకును తీసుకుని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలవనీ యకుండా చూస్తానని అంటున్నారు. నియోజవర్గంలో తనకు బీఆర్ఎస్ టికెట్ కేటాయించక పోయినప్పటి నుంచి ఆ పార్టీపై కక్షసాధిస్తానని చెబుతున్నారు. మరోవైపు ఎన్నికల వ్యవహారం ఖర్చుతో కూడుకు న్నందున పార్టీ టికెట్ ఆశించే అభ్యర్థులకు బుజ్జగింపు చర్యలు చేస్తున్నట్టు తెలుస్తుంది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215